# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ బుధవారం | 19 ఫిబ్రవరి 2025 | ■ 12 పేజీలు


## సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

◆ ఈనెల 24న జిల్లా కేంద్రంలోని రామ్ లీలా మైదానంలో వేడుకలు

◆ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



12



3

# కేంద్రం నిధులపై చర్చకు సిద్ధమా?

- బీజేపీని మతతత్వ వాదులంటే.. ఊరుకునే ప్రసక్తే లేదు
- మరో ఐదు నెలల్లో బీజేపీదే అధికారం
- ముస్లింలను బీసీల్లో చేరిస్తే స్పందించరా?
- మంచిర్యాలలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- 'కులగణన' కొరివితో తలంటుకుంటున్నారు
- రాష్ట్రంలో నెలకొన్న పలు అంశాల పరిష్కారానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే కీలకం...
- మంచిర్యాలలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం

■ ప్రభాత సమాచారం, మంచిర్యాల

'బీసీ లకు 42శాతం రిజర్వేషన్లు అని చెప్పి.. 10 శాతం ముస్లింలను కలిపితే బీసీలకు అన్యాయం జరిగినట్లు కాదా.. కాంగ్రెస్ నేతలు స్పందించరా..? బీసీల్లో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు' అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. 'రంజాన్‌కు ముస్లిం ఉద్యోగులందరికీ సాయంత్రం 4గంటలలోపే విధులు ముగించుకుని వెళ్లిపోవచ్చని మినహాయింపు ఇచ్చారు. అయ్యప్ప, హనుమాన్, భవానీ భక్తులు ఏం పాపం చేశారని.. కాంగ్రెస్‌లోని హిందువులారా.. మీలో నిజంగా హిందూ రక్తమే ప్రవహిస్తే సమాధానం చెప్పాలి..' అంటూ డిమాండ్ చేశారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడారు. అంతకు ముందు పట్టణంలో కార్యకర్తలు, నాయకులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్రం రూ.12.75లక్షల ట్యాక్స్ మినహాయింపు, పదేళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులను తెలంగాణకు ఇచ్చిందన్నారు. కేంద్రం నిధులివ్వడం లేదని ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ బహిరంగ చర్చకు సిద్ధమా..? అని ఈ సందర్భంగా సవాల్ విసిరారు.



## బొజ్జు దాదా బాగా కష్ట పడుతున్నావ్.!

- మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్ నాయక్..
- అనారోగ్యంతో బాధపడుతున్న గోవింద్ నాయక్‌ను పరామర్శించిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- ఇద్దరు నాయకుల మధ్య మాటా-మంతి

అనారోగ్యంతో బాధపడుతున్న బంజారా దిగ్గజం, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్ నాయక్‌ను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. దండేపల్లి మండలం లింగపూర్ గ్రామంలో సొంత ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న గోవింద్ నాయక్‌ను కలిసేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన ఇంటికి వెళ్లారు. ఆరోగ్య పరిస్థితులు, యోగక్షేమాలు తెలుసుకొన్నారు. నాయక్ దంపతులను సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఇద్దరు చర్చించారు. పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన వెడ్మ బొజ్జును గోవింద్ నాయక్ అభినంధించారు. ప్రజలతో మమేకమై నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం చేస్తున్న కృషిని కొనియాడారు.



● వివరాలు 12లో

## బెల్లంపల్లిలో ఐటీ పార్కు మంజూరుకు కృషి

- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించుకోవాలి
- మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మంగళవారం రాత్రి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభ

## ప్రభుత్వ ఆసుపత్రిలో కేంద్ర బృందం

12లో

- మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు
- వైద్య సేవలపై వైద్యాధికారులతో సమీక్షా సమావేశం..
- మొదటి రోజు క్షేత్రస్థాయిలో కేంద్రాల సందర్శన



## నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా రితేష్ రాథోడ్



- ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ రాష్ట్ర సహ ఎన్నికల అధికారి గీతామూర్తి
- నిర్మల్ జిల్లాకు మాజీ దివంగత ఎంపీ రమేష్ రాథోడ్ కుమారుడు రితేష్ రాథోడ్ - 12లో

## బ్యాంకులో రైతుల నిరసన

- తమ అకౌంట్‌లో ఉన్న డబ్బులను బ్యాంక్ అధికారులు హోల్డ్‌లో పెట్టారని రైతుల వినూత్న నిరసన
- ఆదిలాబాద్ పట్టణంలోని ధనలక్ష్మి లాడ్జీ వద్ద గల ఎస్బీఐ బ్యాంకులో ఆందోళనకు దిగిన ముగ్గురు రైతేలు

తమ ఖాతాలో జమ చేసిన డబ్బులను తమకు ఇవ్వాలని రైతులు మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బ్యాంక్‌లో బైఠాయించి నిరసన తెలిపారు.

వివరాలు 2లో







### వేసవిలో సాగు, తాగు నీటి సమస్య లేకుండా

# ప్రణాళికబద్ధమైన చర్యలు

### కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్

**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
రానున్న వేసవికాలంలో సాగునీటికి, తాగునీటికి ఎలాంటి సమస్య లేకుండా ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, రైతు భరోసా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడంతో పాటు రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, తాగునీటికి, నిర్మాణరంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా పాలనలో రేషన్కార్డుల కొరకు అందిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎం.ఎల్.సి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాలను మినహాయించి మిగతా జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డులు అందించాలని తెలిపారు. వ్యవసాయం, గృహ, పారిశ్రామిక రంగాలలో వేసవిలో విద్యుత్ సరఫరాకు డిమాండ్ ఉంటుందని, అదే విధంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ లేని జిల్లాల్లో కొత్త రేషన్ కార్డులు ప్రారంభమవుతాయన్నారు. ప్రభుత్వ, గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దినపత్రికలు, సోషల్ మీడియాలలో వచ్చే ప్రతి కూల వార్తలపై సంబంధిత అధికారుల సమన్వయంతో స్పందించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకో వాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించేందుకు అధికారుల సమ న్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

---

### నీటి నాణ్యతపై రైతులకు

## అవగాహన సదస్సు



**ముథోల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
ముథోల్‌లోని వ్యవసాయ పరిశోధన స్థానంలో సంచార నీటి నాణ్యత ప్రయోగశాల తెలంగాణ ప్రభుత్వం ద్వారా నీటి నాణ్యతపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయదారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, భూగర్భ జల వినియోగదారులు పాల్గొన్నారు. నీటి నాణ్యతపై గల సందేహాలను నివృత్తి చేశారు. ప్రత్యక్షంగా నీటి నాణ్యత ప్రయోగశాల ద్వారా పరీక్షించి వివరాలను తెలిపారు. భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యువకులకు కన్నీటీ వీడ్కోలు

**సారంగాపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ధని గ్రామానికి చెందిన యువకులు సాయన్న, మహేందర్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా నాయకులు ఆస్పత్రికి వెళ్లి శవ పంచనామా చేయించి, మంగళవారం అంతిమ క్రియల్లో పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు. అంత్య క్రియల్లో మిత్రులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

---

# ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



### జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
నిరుద్యోగులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి కే.రాజలింగు సూచించారు. పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆర్ఆర్బీ ఎస్ఎస్సి బ్యాంకింగ్ నాలుగు నెలల ఫౌండేషన్ ఉచిత శిక్షణను మంగళవారం రాజలింగు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పట్టుదల క్రమ శిక్షణతో చదువుకుంటూ అందరూ ఉద్యోగాలు సాధించాలని తెలియజేశారు. వీలైనన్ని ఎక్కువ నమూనా పరీక్షలు రాయాలని సూచించారు. ఇది వరకు శిక్షణ తీసుకున్న ఎంతోమంది కొలువులు సాధించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తరగతులకు విధిగా హాజరు కావాలని సూచించారు. వీరికి స్టైఫండ్, బుక్స్ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

---

### తాగునీటి సమస్య లేకుండా

## ముందస్తు చర్యలు తీసువాలి

### అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
వేసవికాలం నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం కెరమెరి మండలం సాకడ గ్రామం పర్యటించారు. గ్రామంలోని మిషన్ భగీరథ నీటి పథకాలను పరిశీలించారు. వేసవి నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికతో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి ట్యాంకుల శుభ్రత, పైప్ లైన్ల మరమ్మతులను వేగవంతం చేసి లీకేజీ సమస్య లేకుండా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలించారు. అంతకు ముందు జైనూర్ ఉన్నత పాఠశాల ఆయన తనిఖీ చేశారు.



---



### మానవత్వం చాటుకున్న

## ఆసిఫాబాద్ పోలీసులు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
మిట్ట మధ్యాహ్నం ఓ వ్యక్తి మద్యం సేవించి తీవ్రమైన ఎండలో స్పృహ కోల్పోయి నడి రోడ్డుపై పడిపోయాడు. అటుగా వెళ్తున్న ఆసిఫాబాద్ పట్టణ ఎస్ఐ ప్రశాంత్ ఈ దృశ్యాన్ని గమనించారు. వెంటనే కానిస్టేబుళ్లు ప్రేమ్ సింగ్, సందీప్, మహేందర్ల సహాయంతో సదరు వ్యక్తిని నీడలో కూర్చోబెట్టారు. అతడికి డీహైడ్రేషన్ కాకుండా మంచి నీరు తాగించి మానవత్వం చాటుకున్నారు. అనంతరం ఎస్ఐ ప్రశాంత్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పోలీసుల ఆద్వర్యంలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తాగి రోడ్డుపై పడి ఉన్న వ్యక్తి పట్ల ఔదార్యం చూపిన పోలీసుల బృందానికి పట్టణ సీఐ రవీందర్ అభినందనలు తెలిపారు. సాటి వ్యక్తి పట్ల మానవత్వం చూపిన పోలీసులపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

---



### ఆదిలాబాద్ ఎస్‌బిఐ బ్యాంకులో

# బైఠాయించి రైతుల నిరసన

### పోలీసుల జోక్యంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
తమ ఖాతాలో జమ చేసిన డబ్బులను తమకు ఇవ్వాలని రైతులు మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు బ్యాంక్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. ఇది తెలుసుకున్న పోలీసులు, రైతులతో, బ్యాంకు మేనేజర్ తో మాట్లాడారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ తెలిపిన వివరాల ప్రకారం తాంసి మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన జిల్లెల మోహన్‌కు ఒక లక్ష, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన రైతు నల్ల విలాస్‌కు రూ.76000లు,ఇదే గ్రామానికి చెందిన రైతు నక్కల జగదీష్ ఏడాది పత్తి పంటకు సంబంధించిన డబ్బులు పోస్టాఫీసు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. అయితే ఈ డబ్బులు జమ చేసిన వెంటనే సంబంధిత అప్పటి పోస్ట్ ఆఫీస్ మేనేజర్ విజయ్ జాదవ్ సైబర్ క్రైమ్‌కు పాల్పడడంతో పోలీసులు కేసు నమోదు చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ క్రమంలో రైతులకు రావలసిన డబ్బులు సంబంధిత ఢిల్లీ బ్యాంక్‌లో హోల్డ్‌లో ఉన్నాయని వెల్లడించారు. అయితే కొంతమంది రైతులకు అప్పుడు జరిగిన ఆందోళనతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా జోక్యంతో డబ్బులు చెల్లించడం జరిగిందని, మరికొంత మంది రైతులకు చెల్లింపులు కాలేదని అన్నారు. ప్రస్తుతం రైతుల ఆందోళనతో సంబంధిత బ్యాంక్ అధికారులతో మాట్లాడటం జరిగిందని, త్వరలో రైతులకు రావలసిన డబ్బులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటామని బ్యాంకు మేనేజర్ ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళనను విరమించారు. ముందుగా రైతులు ఏడాదిగా తిరుగుతున్న బ్యాంక్ అధికారులు మాత్రం తమను పట్టించుకోవడం లేదని, మా డబ్బులు మాకు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపడంతో బ్యాంక్‌లో గందర గోళం నెలకొంది. ఎట్టకేలకు బ్యాంక్ మేనేజర్ హామీ ఇవ్వడంతో పోలీసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గత నెలలో జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంక్‌లో అధికారులు, సిబ్బంది తీసుకున్న రుణం డబ్బులు చెల్లించాలని వేధించడంతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మరువక ముందే మళ్లీ ఏం జరుగుతోందోనని ఆందోళనకు గురయ్యారు.



## బీజేపీని మతతత్వ వాదులంటే
# ఊరుకునే ప్రసక్తే లేదు

- మరో ఐదు నెలల్లో బీజేపీదే అధికారం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- 'కులగణన' కొరివితో తలంటుకుంటున్నారు
- రాష్ట్రంలో నెలకొన్న పలు అంశాల పరిష్కారానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే కీలకం...
- మంచిర్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం పాల్గొన్న బండి

**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
తెలంగాణలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకే తాను ముక్కలని, లోపాయికారి ఒప్పందం వల్లే కేసీఆర్ కుటుంబాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టులు చేయలేకపోతున్నదని బీజేపీ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ దేశంలోనైనా రాష్ట్రంలోనైనా సుభిక్ష పాలన అందించాలంటే కేవలం బిజెపితోనే సాధ్యమని నొక్కి చెప్పారు. తమ పార్టీని మతతత్వవాదుల పార్టీ అంటే ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని మండిపడ్డారు. మెజారిటీ శాతం ఉన్న బీసీలను వదిలిపెట్టి కేవలం 12 శాతం ఉన్న మైనార్టీ ఓట్ల కోసం ఈ రెండు పార్టీలు పాకులాడుతున్నాయని ధ్వజమెత్తారు. ఉద్యోగ విరమణ వయసు పెంచేందుకు రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రపూరిత మోసాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రిటైర్ అయిన ఉద్యోగులకు కనీసం వారి జీపీఏ డబ్బులు ఇవ్వలేని దీనస్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉందని బండి సంజయ్ విమర్శించారు.

**'కులగణన' కొరివితో తలంటుకుంటున్నారు...**
తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తప్పులతడకగా ఉందని బండి సంజయ్ వాపోయారు. ఒక విధంగా కులగనల సర్వే ప్రక్రియ చేపట్టి కొరివితో తల గోక్కునే విధంగా ఈ ప్రభుత్వ వ్యవహరిస్తున్నదని ఆయన విరుచుకుపడ్డారు. కులగణన సర్వే ప్రకారం రాష్ట్రంలో మూడు కోట్ల 70 లక్షల జనాభా మాత్రమే ఉందని ఈ ప్రభుత్వం తేల్చడం పూర్తిగా అబద్ధం అన్నారు. ఇందుకు రాష్ట్రంలో ఉన్న ఆధార్ కార్డుల ప్రత్యక్ష నిదర్శనమని ఆయన చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా మూడు కోట్ల 90 లక్షల ఆధార్ కార్డులు ఉన్నాయని, మరో 10 శాతం మందికి ఆధార్ కార్డులు ఇవ్వాల్సి ఉందని బండి సంజయ్ వివరించారు. వీరందరిని కలుపుకుంటే రాష్ట్ర జనాభా నాలుగు కోట్ల 30 లక్షల వరకు ఉంటుందని, అలాంటప్పుడు 3 కోట్ల 70 వేలుగా నిర్ధారించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బీసీ జనాభా 51 శాతం ఉంటే.. రేవంత్ రెడ్డి సర్కార్ లెక్కల ప్రకారం 45 శాతం మాత్రమే తేల్చడం విడ్డూరంగా ఉందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. మొత్తానికి కులగణన ఎస్సీ వర్గాల కారణ అంశాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటుందని ఆయన చెప్పారు.

**ఎమ్మెల్సీ ఎన్నికల పరిష్కారం...**
రాష్ట్రంలో నెలకొన్న పలు అంశాల పరిష్కారానికి ఎమ్మెల్సీ ఎన్నికలే కీలకమని బండి సంజయ్ అన్నారు వచ్చి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను బలపరచాలని కోరారు. రాష్ట్రంలో బీసీ వాదాన్ని మొట్టమొదటి వెలుగులోకి తెచ్చింది బిజెపీయేనని, ఏకంగా బీసీ అభ్యర్థిని సీఎం చేస్తామని ప్రకటించిన ఘనత తమ పార్టీకి దక్కుతుందని కూడా బండి సంజయ్ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగుల భక్తి కోసం తాము కృషి చేస్తామని చెప్పారు. బహిరంగ సభకు ముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటనతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది సమావేశంలో బీజెపి జిల్లా అధ్యక్షుడు వెంక టేశ్వర్ గౌడ్, మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్ పాల్గొన్నారు.

### మరో ఐదు నెలల్లో బీజేపీదే అధికారం..
*కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో మరో 5 నెలలు మాత్రమే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. ఆ తర్వాత బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. మంగళవారం మంచిర్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విజిలెన్స్ విచారణ ముగిసినా బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. అలాగే డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా రేసు కేసులు ఎందుకు నీరుగారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి బీఆర్ఎస్ పార్టీ ఏటీఎంలా మారిందన్నారు. న్యూఢిల్లీకి వెళ్లగానే.. కేసులన్నీ ఆగిపోతున్నాయని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. 317 జీవో రద్దు కోసం కొట్లాడింది బీజేపీ పార్టీనేనని ఆయన తెలిపారు.*



## బేలలో రైతుల రాస్తారోకో

**బేల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
బేల మండల కేంద్రంలో పలువురు కంది రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. తమ పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల నిరసనతో మండల కేంద్రంలో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రైతులతో ఎస్సై దివ్యభారతి మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్ శాఖ అధికారులతో మాట్లాడి రైతులకు సర్దిచెప్పారు. ఎస్సై హామీతో రైతులు నిరసనను విరమించారు.

# పంటల సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
పంటల సాగులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంట దిగుబడులలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వారిని జాగృతం చేసేందుకు రైతు సంఘం నాయకులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామంలో తన సొంత పొలంలో నాటు వేశారు. ప్రయోగాత్మకంగా పంటలో కలిగే నష్టాలను ఎలా నివారించాలి అనే కోణంలో రైతులకు అవగాహన కల్పించేందుకు దృష్టి సారించారు. ఈ మధ్యకాలంలో పంటలపై వాతావరణ ప్రభావంతో పలు తెగుళ్లు సోకి పంటలకు నష్టం వాటిల్లుతుందన్నారు. పంటలు మార్కెట్లోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం కనీస ధరను ప్రకటించకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి పంటకు మద్దతు ధర ప్రకటించి రైతుల నష్టాలని ప్రభుత్వం భరించిందని గుర్తు చేశారు. ఆయన వెంట గోవర్ధన్ యాదవ్, లక్ష్మణ్, బట్టు సతీష్, నల్ల మహేందర్, కాసర్ల అశోక్, పట్టెపు విలాస్, రామన్న, నల్ల రామన్న, విఠల్ గేడ, పట్టేపు అశోక్, సీహెచ్ ఇస్తారి, దేవన్న ఉన్నారు.

## వికలాంగురాలిపై
# లైంగికదాడికియత్నం
### నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
వికలాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన వ్యక్తికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్ట్ న్యాయమూర్తి యువరాజు తీర్పు ఇచ్చారు. కౌటల సీఐ ముత్యం రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలమనేపల్లి మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన ఓ వికలాంగురాలిపై 18/04/2023 రోజున అదే గ్రామానికి చెందిన కామెర శంకర్ (40) అనే వ్యక్తి అత్యాచార యత్నం చేయబోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో నిందితుడు పరుగులు తీశాడు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులు నిందితుడిని శంకర్‌గా గుర్తించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే గ్రామంలో తమ పరువు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ జరిపిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో కామెర శంకర్‌కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ. 9000 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ జీవీఎస్ ప్రసాద్ వాదించారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషిచేసిన కోర్ట్ లైజనింగ్ ఆఫీసర్ రాంసింగ్ ఎ.ఎస్.ఐ,సి.డి.ఓ బాలాజీ ఏ.ఎస్.ఐలను జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అభినందించారు.

## పోలీస్ ఎస్కార్ట్ నుంచి
# పారిపోయిన వ్యక్తికి జైలు

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
పోలీస్ ఎస్కార్ట్ నుండి పారిపోయిన నెన్నెల మండలానికి చెందిన బాపుకు జడ్జి ముఖేష్ ఏడాది జైలు శిక్ష విధించినట్లు వన్ టౌన్ సీఐ దేవయ్య తెలిపారు. బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నుంచి ఆసిఫాబాద్ జైలుకు తరలిస్తుండగా బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద బస్సు ఎక్కుతుండగా పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకున్నాడని పేర్కొన్నారు. నేరం రుజువు కావడంతో శిక్ష విధించారు.

# భారీగా గంజాయి పట్టివేత.. ముగ్గురిపై కేసు నమోదు

**గుడిహత్నూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద ఓ వ్యక్తి ఆటోలో ఆరు కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారని డీఎస్పీ నాగేందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగేందర్ తెలిపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్ వద్ద ఇచ్చోడ సీఐ భీమేష్, ఎస్సై మహేందర్ పోలీసు సిబ్బందితో వాహనాల తనిఖీ చేపడుతుండగా ఇంద్రవెల్లి వైపు నుండి గుడిహత్నూర్ వైపు అనుమానాస్పదంగా వస్తున్న ఆటోను ఆపి పోలీసులు తనిఖీ చేయగా అందులో ఆరు కిలోల గంజాయి లభించగా పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో గంజాయిని తరలిస్తున్న ఇంద్రవెల్లి మండలం అందునాయక్ తాండా గ్రామానికి చెందిన పడ్వాల్ కపూర్ సింగ్ ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గుడిహత్నూర్ మండలంలోని తోయ గూడ గ్రామానికి చెందిన తోడసం గోద్రు వద్ద కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలిపాడు. నిందితుడు తెలిపిన సమాచారం మేరకు పోలీసులు గోద్రు ఇంటికి వెళ్లి అతని ఇంటిని తనిఖీ చేయగా అతని ఇంటిలో కిలో గంజాయి, రూ.ఐదువేల నగదు, ఒక సెల్ ఫోన్ లభించడంతో వాటిని స్వాధీన పరుచుకొని అతనిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మండలంలో ఎవరైనా రైతులు గంజాయిని పండిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామన్నారు. యువత గంజాయిని సేవించడం వల్ల అనేక రకాల ఇబ్బందులకు గురై చెడు వ్యసనాలకు లోనవుతున్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తామన్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ భీమేష్,ఎస్ఐ మహేందర్ ను డీఎస్పీ నాగేందర్ అభినందించారు.



# తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు

## కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్

**నిర్మల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాదులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి త్రాగునీరు, విద్యుత్ వినియోగం, రైతు భరోసా, ఆహార భద్రత కార్డుల పరిశీలన, రబీ సీజన్ సాగు నీరు, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, రానున్న వేసవిలో త్రాగు నీటి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలందరికీ నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా





కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులందరూ ఎప్పటికప్పుడు ప్రభుత్వ వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి ఈవీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని మాట్లాడుతూ, జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగు నీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల కోసం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాలను కలెక్టర్ సిఎస్‌కు వివరించారు. ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు ఆర్బిఎస్కే బృందాల ద్వారా ఆరోగ్య పరీక్షలను నిర్వహించి, అవసరమైన విద్యార్థులకు ప్రత్యేక ఆహారం మందులు తీసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సీఎస్ అభినందించారు.




## చట్టాలపై అవగాహన ఉండాలి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆదిలాబాద్ న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి సౌజన్య సూచించారు. మంగళవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో, జువైనల్ చట్టాలతో పాటు తదితర వాటిపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉన్నపుడే వాటి ద్వారా రక్షణ పొందగలుగుతామన్నారు.

## ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి కార్మికులు, ఉద్యోగులు కృషి చేయాలని రీజనల్ మేనేజర్ సోలోమాన్ అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు మంగళవారం ఆదిలాబాద్, ఉట్నూర్ డిపో సిబ్బందికి 'పవర్' అనే అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు వారి పనితీరు, ప్రయాణికుల పట్ల సత్ప్రవర్తన, తదితరాంశాలపై శిక్షణ అందించారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్, డీఎం కల్పన తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం

**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** మేదరిపేట గ్రామపంచాయతీ పరిధిలో మాదాపూర్ శ్రీ శ్రీ గోశాల వినాయక, హనుమాన్ ఆలయంలో మంగళవారం గోశాల నిర్వహకులు గుండం భూమన్న ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం మాదాపూర్‌కు చెందిన భక్తుడు గడిపేల్లి మల్లేష్ అల్పాహారం సమకూర్చారు.

# పట్టుదలతో శ్రమిస్తే విజయం సొంతం

### మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావ్ పటేల్

**ముథోల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** పట్టుదలతో చదువుతే విజయం సొంతమవుతాదని మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్ అన్నారు. మంగళవారం ముథోల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతెలుగు మీడి యం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, తెలంగాణ ట్రైబల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ పాఠశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, మహాత్మాజ్యోతి బాపులే గురుకుల పాఠశాల, రబింద్ర హైస్కూల్, శ్రీ సరస్వతి శిశుమందిర్ ఉన్నత ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలల విద్యార్తిని విద్యార్థులకు మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ తరుపున ట్రస్ట్ ఛైర్మెన్ మోహన్ రావ్ పటేల్ మంగళవారం ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయిస్తూ విజయం సాధించాలని, తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విధ్యార్థులు అనుసరించాల్సిన విధానంపై వివరించారు. కార్యక్రమంలో మాజీ



ఎంపిపి సుభాష్ జాదవ్, నాయకులు ధర్మపురి సుదర్శన్, సంగోల్ల పోతన్న, ట్రస్ట్ టీం సభ్యులు, ముథోల్ టౌన్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐఎఫ్ ప్యానల్లతో విద్యార్థులకు బోధించాలి

### మండల విద్యాధికారి బి. శ్రీనివాస్

**జైపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** పాఠశాలల్లో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్లతో విద్యార్థులకు బోధించాలని మండల విద్యాధికారి బి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోజున జరిగిన ఫిజికల్ సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్య కోసం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటుచేసిన ఐ. ఎఫ్. ప్యానల్లను వినియోగించాలన్నారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న దశలో మనమంతా ఉన్నామని, ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేది ఉపాధ్యాయులు మాత్రమే కాబట్టి ఈ ఓరెంటేషన్ శిక్షణ బోధనకు ఉపకరిస్తుందని అన్నారు. రాబోయే పదవ తరగతి వార్షిక పరీక్షలదృష్ట్య విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాసే విధంగా అందరూ ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, భీమారం మండలకు



చెందిన భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు అందరూ సమావేశంలో పాల్గొన్నారు. కె.రామకృష్ణ, ప్రసాదరావు, విగ్నేష్, ఎం రమేష్, కొత్త రమేష్ బాబు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు.

## మైనార్టీల సంక్షేమానికి
# ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ఉట్నూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం కడం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం ప్రతినిధులు ఉట్నూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను కలిసి మండల కేంద్రంలో షాదీ ఖానా, ఖాబ్రస్థాన్, మైనారిటీల సమస్యలు వివరించారు. దీంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జమ మస్జీద్, మొహమ్మయదియా మస్జీద్ అధ్యక్షులు వజీర్ ఉర్ రెహమాన్, వాజీద్ ఖాన్, మహమూద్, షార్ఫుద్దీన్, వసిఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయం ఆకస్మిక తనిఖీ

**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం గుడిపేటలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కేంద్రీయ విద్యాలయం ద్వారా విద్యార్థినీ, విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలు, కళలలో రాణించే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో కేంద్రీయ విద్యాలయనికి స్వంత భవనాన్ని కేటాయించి మరింత మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం



చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన విద్యాలయం భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మారుతి పాల్గొన్నారు.

# టెన్త్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. యాదయ్య లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ పరీక్ష ఉదయం 9.30 గం॥ల నుండి మధ్యాహ్నం 12.50 గం॥ల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గం?ల నుండి 11 గం॥ల వరకు మినహా మిగతా పరీక్షలు ఉదయం 9.30 గం॥ల నుండి మధ్యాహ్నం 12.30 గం॥ల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందు కొరకు జిల్లాలో 49 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 9 వేల 189 మంది రెగ్యులర్, 221 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టి.జి.ఎస్.ఆర్.టి.సి. అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలోని పరీక్ష కేంద్రాలలో పారిశుద్ధ్యం నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో వార్షిక పరీక్షలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, మున్సిపల్ కమీషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## హీరాసుక జయంతి కార్యక్రమం విజయవంతం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
సాత్నల మండలంలోని జమిని గ్రామంలో ఆదివాసీ ప్రధాన్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆదివాసీ ధర్మ గురు హీరా సుఖ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉట్నూర్ ఐటీడీఏ ఏపీఓ మెస్రం మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భూమి మీద పుట్టిన ఆది గురువు హీరాసుక అని కొనియాడారు. ఆదివాసుల సంస్కృతి సంప్రదాయాలు కనిపిస్తున్నాయంటే హీరా సుకగురువు కారణమన్నారు.

## నేడు హిందూ వాహిని ఆధ్వర్యంలో శోభయాత్ర



ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆదిలాబాద్ పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూ వాహిని ప్రతినిధులు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈనెల 19 తేదిన నిర్వహించనున్న శోభాయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీ గోపాలకృష్ణ మఠం నుంచిశోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

## భోగ్ భండార్‌లో ఆత్రం సుగుణ



ఉట్నూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
ఉట్నూర్ మండలం తాండ్ర గ్రామంలో మంగళవారం జగన్నాథ స్వామి భోగ్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధూర-లభాన కులస్తులు జరుపుకునే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ హాజరై ప్రత్యేక పూజలు చేసి అన్నదానంలో పాల్గొన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని జగన్నాథ స్వామిని వేడుకున్నారు.

## చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

సారంగాపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
రోడ్డుప్రమాదంలో ద్విచక్రవాహనం చెట్టును ఢీ కొని వ్యక్తి మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన సారంగాపూర్ మండలంలోని చించొలి (బి) గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధని గ్రామానికి చెందిన కొప్పుల సాయన్న, అయిటి మహేందర్ నిర్మల్ వైపు వెళుతున్నారు గ్రామానికి వెళ్తున్నారు. ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు ప్రక్కకు అన్న చెట్టును ఢీ కొట్టగా.. సాయన్న అక్కడికక్కడే మృతి చెందారు. మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## లక్ష్యంతో ముందుకు సాగాలి



తాంసి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అదనపు ఎస్పీ సురేందర్ రావు అన్నారు. జాతీయ సైన్స్ డే పురస్కరించుకుని మండలంలోని కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్ ఫేర్ ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎగ్జిబిట్లను సందర్శించి విద్యార్థుల ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రాధిక, ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితులకు పరామర్శ

ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
మాజీ మంత్రి జోగు రామన్న మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తాంతోలి గ్రామానికి వెళ్లారు. పలు కుటుంబాలను జోగు రామన్నపరామర్శించారు. ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి గాయాల పాలైన బార్కుంటి కుమార్ తోపాటు అతని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని వారికి ధైర్యాన్ని నచ్చ జెప్పారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఓజుల లసుం బాయ్ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జోగు రామన్న వెంట ఆఫ్ కం గంగయ్య, కనక రమణ, భూమన్న, నవీన్ రమణ ఉన్నారు.





## ఇసుకను అక్రమంగా తరలిస్తే.. కఠిన చర్యలు తప్పవు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసినా, నిల్వ చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ దోలకాసి చంద్రశేఖర్ అన్నారు. రెబ్బెన పోలీస్ స్టేషన్ మండల పరిధిలోని గొల్లగూడలో మంగళవారం రోజున ఇసుక రీచ్ లను ఎమ్మార్వో రామ్మోహన్, ఏడీ మైనింగ్ గంగాధర్‌లతో ఎస్సై చంద్రశేఖర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అక్రమ ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

## ఘనంగా జగదాంబ దేవి ఆలయ ప్రారంభోత్సవం



ముథోల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
ముథోల్ మండలం తరోడ గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన తరోడ తండాలో తండా వాసుల ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ జగదాంబ దేవి ఆలయంతో పాటు సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మి నర్సాగౌడ్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రాజేష్ బాబు హాజరయ్యారు. సాంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యం



## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

లక్సెట్టిపేట, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)
మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని 100 పడకల ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుం టుందని, ఈ క్రమంలో మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసి అనేక రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెదక్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం నం.32ను సందర్శించారు. తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ పరిధిలోని డంపింగ్ యార్డును సందర్శించారు. తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, ఇందులో ఉపయోగకరమైన చెత్తను వేరుచేసి కంపోస్ట్ షెడ్‌కు తరలించే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన డీసీసీబీ చైర్మన్

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులను హైదారాబాద్‌లో వారి కార్యాలయాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ అడ్డి భోజారెడ్డి మంగళవారం కలిశారు. డీసీసీబీ, పీఏసీఎస్ పదవీకాలం పొడిగించినందుకు సీఎంతో పాటు మంత్రులను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వివిధ జిల్లాల డీసీసీబీ చైర్మన్లు, తదితరులున్నారు.

## 31లోగా పన్ను చెల్లించాలి



**ముథోల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

భైంసా పురపాలక కార్యాలయాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్, ప్రత్యేక అధికారి ఫైజాన్ హైమాద్ సందర్శించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంకు సంబంధించి ఆస్తి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మార్చ్ 31లోగా ప్రాపర్టీ, నీరు, ట్రేడ్ లైసెన్స్ పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

## 23 మందికి జరిమానా

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై దుబ్బక సునీల్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 23 మందిని ఉట్నూరు కోర్టులో మంగళవారం హాజరు పరిచినట్లు తెలిపారు. 23 మంది నిందితులకు ఉట్నూరు కోర్టు మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రూ. వేయి చొప్పున జరిమానా విధించారని తెలిపారు.

## విద్యార్థులు షీటీం సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

పోలిస్ శాఖ ద్వారా షీటీం అందిస్తున్న సేవలను మహిళలు సద్వినియోగం చేసుకో వాలని షీటీం ఇన్చార్జి ఎస్ఐ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశా ల విద్యార్థులకు షీటీం, భరోసా సెంటర్ అందిస్తున్న సేవల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు మహిళలు అన్యా యానికి గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలకు ఎలాంటి సమస్య ఉన్న నిర్భ యంగా షీటీం నెంబర్ 8712670564 లేదా 100కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజల కొరకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రిని 100 పకడల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి అనేక రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మందుల నిల్వలను అందుబాటులో ఉంచడం, ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, పాఠశాల పరిసరాలు, రిజిస్టర్లను పరిశీలించి ఉపాధ్యాయులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచి అందిస్తుందన్నారు. విద్యార్థులకు నూతన మెను ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని అన్నారు. అదేవిధంగా వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు.

# పోడురైతుల జోలికొస్తే ఊరుకునేది లేదు

### ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్

**పెంచికల్‌పేట్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

అటవీశాఖ అధికారులు పోడురైతుల జోలికి వస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్సీ దండె విఠల్ హెచ్చరించారు. మండలంలోని కొండపల్లిలో మంగళవారం పోడు భూములను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టి హద్దులు నిర్ణయించాల్సి ఉండగా ఇరు శాఖల అధికారులు సమస్య పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. పోడు రైతుల పక్షాన కేంద్ర మంత్రులను కలిసి సమస్య విన్నవిస్తానన్నారు. అంతకు ముందు చేడ్వాయి గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు సుజాత శ్రీనివాస్, చంద్రమౌళి, ఎల్కరి సుధాకర్, నాయకులు రాజన్న, రాచకొండ కృష్ణ, ఇలియాస్, సదాశివ్, నందు, శంకర్ గౌడ్, రైతులు ఉన్నారు.

**ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాం**

ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఎన్నికల



ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం రాష్ట్ర ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ నెల 20న కాగజ్‌నగర్ మండలం వినయ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇన్చార్జి మంత్రి సీతక్క రానున్నారని నాయకులు, కార్యకర్తలు, పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కుర్సంగే ఓంప్రకాశ్, మాజీ జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, సలుగుపల్లి మాజీ సర్పంచ్ కొడుప విశ్వేశ్వర్, మర్తిడి మాజీ సర్పంచ్ ఉమ్మెరి లింగయ్య, సామల రాజన్న, ఉమా మహేష్, సిరిపురం సదాశివ్, రంగు సురేష్ గౌడ్, గుమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ రత్న కళ్యాణి



**ఖానాపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ జిల్లాలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా జరిగే విధంగా జరిగే విధంగా చూడాలని నిర్మల్ జిల్లా ఆర్టీవో రత్న కళ్యాణి సూచించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని జూనియర్ కళాశాలలోని పోలింగ్ బూత్‌లను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రత్న కళ్యాణి మాట్లాడుతూ జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా జరిగే విధంగా చూడాలని అన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల్ని పలకరించి పలు ప్రశ్నలు వేసి జవాబులు అడిగారు. విద్యార్థులుకు సమాధానాలు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ భయాందోళన చెందకుండా నిశ్చయంగా పదో తరగతి పరీక్షలు రాయాలని అన్నారు. జిల్లాలోనే పదో పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆమె విద్యార్థులతో అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుజాత, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగేష్, అంగన్వాడి టీచర్ పుష్పలత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల అభివృద్ధికి కృషి చేస్తా

**బోథ్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

బోథ్ మండలం పట్నపూర్ గ్రామానికి చెందిన చైతన్య యూత్ క్లబ్ సభ్యులు మంగళవారం మాజీ ఎంపీ సోయం బాపూరావును కలిశారు. ఈ మేరకు యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వాలిబాల్ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి రూ.25 వేల నగదును అందజేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ముందు ఉంటానన్నారు. ప్రభుత్వం సైతం క్రీడల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.



# ప్రజల రక్షణే పోలీసుల ధ్యేయం

### - సీఐ కుమారస్వామి - మండలంలో పోలీసు కార్డెన్ సెర్చ్





**తాండూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

ప్రజల రక్షణ, మహిళల భద్రత పోలీసులు ప్రధాన ధ్యేయమని సీఐ కుమారస్వామి అన్నారు. మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలు నియంత్రించేందుకు, ప్రజలకు దగ్గర అయ్యేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అసాంఘిశక్తులకు, అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ పత్రాలు ఉంచు కోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. టౌన్ షిప్ లో పోలీసులు సోదాలు నిర్వహించి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలులేని 50ద్విచక్ర వాహనాలు, 10ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సెలు సౌజన్య, కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





## రానున్న వేసవి దృష్ట్యా
# ముందస్తు చర్యలు చేపట్టాలి

- తాగునీటి ఇక్కట్లు గుర్తించి బోరు బావులు, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలి
- క్షేత్ర స్థాయిలో పరిశీలన చేపట్టి ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయనే దానిపై నివేదిక అందజేయాలి
- విద్యుత్ సరఫరాలో ఇబ్బందులుంటే నెంబర్ 1912కు ఫిర్యాదు చేయాలి - వీసీలో సీఎస్ శాంతికుమారి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** తాగునీటి సరఫరా సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు టోల్ ఫ్రీ నెంబర్ 18005994007 ద్వారా కూడా ప్రజలు తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం ఐదు ప్రధాన అంశాల పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పాల్గొన్నారు. తాగునీరు, రేషన్ కార్డుల, విద్యుత్, రైతు భరోసా, ఇరిగేషన్ రబీ క్రాఫ్‌లకు సంబంధించిన అంశాల పై సి.ఎస్ ఆన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఎక్కడ కూడా తాగునీరు, సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారి సూచించారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే, సత్వరమే పరిష్కరించాలని, ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రానున్న వేసవి కాలంలో తాగు నీరు, విద్యుత్‌లో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా నిరంతరం తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అధికారులు అనునిత్యం నిశితంగా పర్యవేక్షించాలని, ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. జలాశయాలలో నీటి నిల్వలు అందుబాటులో ఉన్నందున వేసవిలో నీటి ఎద్దడి నెలకొనకుండా, లీకేజీలకు తావు లేకుండా మంచినీటి సరఫరా వ్యవస్థను పటిష్టపర్చాలని సూచించారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన సమస్యల పరిష్కారానికై కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, టోల్ ఫ్రీ నెంబర్ 18005994007 ద్వారా కూడా ప్రజలు తాగునీటి సమస్య గురించి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. క్షేత్ర స్థాయిలో ఏర్పడే ఇబ్బందులను పరిష్కరించేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలని, తాగునీటి సరఫరాకు సంబంధించి క్షేత్రస్థాయి నుంచి క్రమం తప్పకుండా సమాచారం సేకరించాలని కలెక్టర్లకు సూచించారు. అన్ని పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకు మిషన్ భగీరథ జలాలను సరఫరా చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానికంగా అందుబాటులో ఉన్న జల వనరులను వేసవి సీజన్ చివరలో వినియోగించుకునేందుకు వీలుంటుందని అన్నారు. పట్టణాలలో ఏర్పడిన నూతన కాలనీలు, చివరి ఆవాస ప్రాంతాలలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని, ఇబ్బందులు ఉన్న ప్రాంతాలకు ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. అదేవిధంగా రబీ పంటలు చేతికందే వరకు సాగు నీటి వసతి కల్పించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. సాగు, తాగునీటి పథకాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న మార్చి, ఏప్రిల్, మే మాసాలలో విద్యుత్ వినియోగం పెరిగే అవకాశాలు ఉన్నందున ముందస్తుగానే ప్రణాళికలు రూపొందించుకుని వ్యవసాయానికి, గృహావసరాలకు, పరిశ్రమలకు కోతలు లేకుండా కరెంటు సరఫరా చేయాలని సూచించారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా విద్యుత్ ఉత్పాదకత ఉన్నందున, సరఫరా లోపాలను సవరించుకుని ఆయా రంగాలకు కోతలు లేకుండా విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. కాగా, సాగుకు యోగ్యమైన వ్యవసాయ భూమి కలిగి పంటలు పండిస్తున్న ప్రతి రైతుకు రైతు భరోసా కింద ఆర్థిక తోడ్పాటును అందించేందుకు చొరవ చూపాలన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాలన గ్రామ సభలు, ఇతరత్రా మార్గాల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను సత్వరమే పూర్తిచేసి, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ అయ్యేలా వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయించాలని సూచించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పక్కాగా మెనూ అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగా అన్ని చర్యలు తీసుకోవాలని , 97 హ్యాబిటెషన్‌లలో త్రాగునీటి కి ఇబ్బందులూ ఉన్న వాటిని గుర్తించి బోర్ వెల్స్ రిపేర్, వాల్స్, పైప్ లైన్, తదితర మరమ్మత్తులు చేయించాలని ఆన్నారు. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇంద్రవెల్లి, గాదిగూడ, ఉట్నూర్, అదిలాబాద్ రూరల్‌లో ఎక్కువగా చేయాలనీ, బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ వేయాలని సూచించారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్నచోట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని, ఈ వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి సమస్యలు కలగకుండా చూడాలని ఆన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ వినోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## గన్నారం వ్యవసాయ క్షేత్రం
# సందర్శించిన కోనప్ప



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామంలో తమ వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సేంద్రియ పద్దతిలో కూరగాయలు పండించడానికి పనులు ప్రారంభించారు. ఇటీవలే పలు జిల్లాలో సేంద్రీయ పద్దతిలో కూరగాయల సాగు విధానాన్ని పరిశీలించి అక్కడి రైతులతో పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట మాజీ జెడ్పీటీసీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులను ప్రారంభించిన ఎంపీడీఓ రమేష్

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమేష్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కార్యక్రమ అధికారి ఇందనపల్లి బుచ్చన్న, సాంకేతిక సహాయకులు షోయబ్, పంచాయితీ కార్యదర్శి సలీం, క్షేత్ర సహాయకుడు పోశెట్టి, గ్రామ కూలీలు పాల్గొన్నారు.



---

# గ్రామాల శివారులో పులి సంచారం



**నెన్నెల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** మండలంలోని జోగాపూర్, ఆవుడం, చిత్తాపూర్, పొట్యాల గ్రామాల శివారు అడవుల్లో పులి సంచరిస్తోంది. దీంతో పశువుల కాపరులు, రైతుల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. పది రోజులుగా బెల్లంపల్లి డివిజన్లోని కన్నాల, తాండూర్, కాసిపేట అడవుల్లో సంచ రించిన పులి చర్లపల్లి ఎల్లారం మీదుగా కుశ్న పల్లి రేంజ్ పరిధిలోని రంగపేట, జోగాపూర్ అడవి గుండా ఆవుడం, చిత్తాపూర్, పొట్యాల అడవుల్లోకి ప్రవేశించిందని నీల్వాయి రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. మంగళవారం చెన్నూర్ ఎఫ్ఓ సర్వేశ్వరరావు, మంచిర్యాల రేంజ్ అధికారి రత్నాకర్ అటవీ సిబ్బందితో కలిసి చిత్తాపూర్ చెరువు వద్ద పులి పాదముద్రలు గుర్తించినట్లు చెప్పారు. గంగారాం అటవీ గుండా కొత్తూర్ మీదుగా జైపూర్, భీమారం అడవుల్లోకి పులి వెళ్లినట్లు గుర్తించామని పేర్కొన్నారు. అటవీ సమీప ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

---

# యూరియా కోసం ఆందోళన

**ఖానాపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** పట్టణంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్స్ వద్ద ఖానాపూర్, కడెం, పెంబి మండలాల రైతులు మంగళవారం ఆందోళన చేశారు. యూరియా కోసం వచ్చిన రైతులకు నిర్వాహకులు గంటగులికలు, ఇతర మందులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామని బలవంతంగా కొనిపిస్తున్నారు. దీంతో రైతులు నిర్వాహకులను నిలదీశారు. అనంతరం స్థానిక వ్యవసాయ అధికారులకు ఫోన్లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి జగదీశ్వర్ను వివరణ కోరగా.. రైతులు చెప్పిన వెంటనే ఎటువంటి ఇతర మందులు కొనుగోలు చేయకుండానే యూరియా ఇవ్వాలి నిర్వాహకులను ఆదేశించామన్నారు. ఈ విషయమై విచారణ చేసి తగు ఆదేశాలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కల్మర్ రాజేశ్వర్, రాచర్ల శేఖర్, జోగు రాజేశ్వర్, బూక్య గోవింద్నాయక్, కుందూరి గంగాధర్, గాడ్పు రాజేందర్, కట్ల మహేశ్, కోమటిపెల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



---

## భక్తులకు ఇబ్బందులు
# తలెత్తకుండా చూడాలి

**జైపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** వేలాలలో ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు నిర్వహించే మల్లన్నస్వామి జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, జైపూర్ ఏసీపీ ఏ.వెంకటేశ్వర్ తెలిపారు. జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో మంగళవారం జాతర నిర్వహణ, ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలపై అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించారు. సౌకర్యాలు, నీటి వసతి, విశ్రాంతి కోసం టెంట్లు, వైద్య సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాట్లపై చర్చించారు.

## హీరాసుక జయంతిని
# విజయవంతం చేయండి

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో ఈ నెల 23న నిర్వహించనున్న హీరా సుక జయంతిని ఉమ్మడి జిల్లా ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులస్తులు పెద్ద సంఖ్యలో తరవచ్చి విజ యవంతం చేయాలని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ జాతీయ నాయకుడు సిడాం రాంకిషన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మెస్రం శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పూసం ఆనంద్లవ్, సెడ్మకి సుభాష్, గేడం మాధవ్, ప్రకాశ్, రామాకాంత్ తదితరులున్నారు. హీరాసుక జయంతికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పర్ధానగూడ జ్ఞానేశ్వర్, పర్ధాన్ సమాజ్ మండల అధ్యక్షుడు గేడం భరత్ కోరారు.

---

# కష్టపడి చదివితేనే భవిష్యతు : డీఈవో

**సారంగాపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)** విద్యార్థులు కష్టపడి చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని డీఈవో రామారావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా పదో తరగతికి సమాయత్తమవుతున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. సిలబస్, రివిజన్ తరగతులు, ప్రత్యేక తరగతుల నిర్వాహణ తదితర విషయాలను తెలుసుకున్నారు. ప్రత్యేక తరగతులకు ఏఒక్క విద్యార్థి కూడా గైర్హాజరు కావొద్దని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు సైతం కష్టపడి చదివి మంచి జీపీఏ సాధించాలన్నారు. సీ-గ్రేడ్ విద్యార్థులను ఏగ్రేడ్లోకి తీసుకురావడానికి ఉపాధ్యాయులు సైతం అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఇక భోజనం విషయంలో రాజీపడొద్దన్నారు. ప్రతీరోజు ఒక ఉపాధ్యాయుడు భోజనం వండే సమయంలో అందుబాటులో ఉండి మెనూ ప్రకారం రుచికరంగా అందేలా చూడాలని సూచించారు. అనంతరం ప్రతీ తరగతి గదికి వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఎంఈవో మధుసూదన్, హెచ్ఎం విజయ, ఉపాధ్యాయులు ఉన్నారు.

- తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి
- పరారీలో నిందితుడు
- తలమడుగు మండలం రుయ్యాడిలో ఘటన
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

# బావను కత్తితో పొడిచి చంపిన బామ్మర్ది

తలమడుగు, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) మండలంలోని రుయ్యాడి గ్రామంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. బామ్మర్ది కత్తితో బావ ఛాతిలో పొడవగా తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ మండలం తంతోలి గ్రామానికి చెందిన కోక్కురు మహేందర్ (40), తలమడుగు మండలం రుయ్యాడికి చెందిన నవనీతతో 15 ఏళ్ల క్రితం పెళ్లయింది. ఈ దంపతులకు కుమారుడు రాఘవేంద్ర, కుమార్తె దేవిక ఉన్నారు. 13 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి రుయ్యాడి గ్రామానికి వలస వెళ్లాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. భర్త వేరే మహిళతో సన్నిహితంగా ఉంటున్నాడని నెల రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని భార్య కుటుంబ సభ్యులకు చెప్పింది. మంగళవారం మహేందర్ అతని బామ్మర్ది కుర్మా అశోక్‌లు ఘర్షణ పడ్డారు. మాటమాట పెరగడంతో అశోక్



కత్తితో మహేందర్ ఛాతీలో పొడిచాడు. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో రూరల్ సీఐ ఫణిందర్, తాంసి ఎస్సై రాధిక సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి తమ్ముడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

# భార్యపై హత్యాయత్నం

### అత్త, బంధువులపై కూడా

### ఇంద్రవెల్లిలో ఘటన.. కేసు నమోదు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) భార్యతోపాటు అత్త, బంధువులపై భర్త కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలకేంద్రంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన సంజీవాణికి దనోరా(బి) గ్రామానికి చెందిన గుట్టె అంకుష్తో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. భర్త అంకుష్ గత కొంత కాలంగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఆమెతో గొడవ పడేవాడు. వారం క్రితం సంజీవణి తల్లిగారింటికి వచ్చి ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం సంజీవాణి ప్రియుడు రాహుల్ అంకుష్కు ఫోన్ చేసి నిభార్యతో ఉన్న ఏం చేస్తావో చేయ్యి..అంటూ చెప్పాడు. అంకుష్ కోపంతో అత్తగా రింటికి వచ్చి భార్యపై కత్తితో దాడి చేశాడు. ప్రతిఘటిం చిన తల్లి కేంద్రే అనిత, అమ్మమ్మ రాధాబాయిలపై దాడి చేయగా వారికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రగాయాలైన సంజీవాణితోపాటు ఇద్దరిని స్థానికులు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సునీల్ ఆస్పత్రికి చేరుకుని క్షతగా త్రులను 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. బాధి తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



### అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

ఖానాపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) ఖానాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారి వెంట అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని మంగళవారం ఖానాపూర్ తహశీల్దార్ సుజాత తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌కు రూ. 5వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.అక్రమంగా ఇసుక రవాణా చేసినా, నిలువ ఉంచినా చర్యలు తీసుకుంటామన్నారు.

### బీఆర్ఎస్ క్యాలెండర్ల ఆవిష్కరణ



బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) బీఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సర డైరీలు, క్యాలెండర్లను బెల్లంపల్లి పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయేది బీఆర్ఎస్ పాలనయేనని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పాలనలను తిరిగి ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అరుణ్ కుమార్, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 8న జాతీయ లోక్ అదాలత్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకుగానూ మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. క్రిమినల్, సివిల్, ప్రిలిటిగేషన్, బ్యాంకింగ్, భూ సమస్యలు, వాహనాల ప్రమాదాల కేసులను రాజీమార్గం ద్వారా పరి ష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఇస్కాన్ పేరిట రియల్ వ్యాపారం



#### సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తో పాటు ఒకరిపై కేసు

భీమారం, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) మండల కేంద్రంలో ఇస్కాన్ సంస్థ పేరిట రియల్ వ్యాపారం చేస్తున్న సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తో పాటు ఒకరిపై కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇస్కాన్ సంస్థ లోగోని వాడుకుంటూ భీమారంలో సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఇస్కాన్ జనరల్ మేనేజర్ హనుమాన్ విజయదాసు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సిస్కో ఇన్‌ఫ్రా డెవలపర్స్‌తోపాటు హరికృష్ణ సంకీర్త్ మందిర్ నిర్వాహకుడు చంద్రదాసుపై కేసు నమోదైంది. వారికి నోటీసులు జారీ చేసి విచారణకి హాజరుకావాలని కోరనున్నట్లు ఏసీపీ



తెలిపారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న వెంచర్లోనే ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేయాలని సూచించారు. సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్సై శ్వేత పాల్గొన్నారు.

# గిరిజనుల గుడిసెల తొలగింపు

### నిద్రిస్తున్న వారిని లేపి మరీ గుడిసెల కూల్చివేత

జన్నారం, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలోని గడ్డంగూడ గ్రామ సమీపంలోని 308 కంపార్టుమెంట్ అటవీ ప్రాంతంలోని గిరిజనుల గుడిసెలను మంగళవారం తెల్లవారు జామున అటవీ శాఖ అధికారులు తొలగించారు. గుడిసెల్లో నిద్రిస్తున్న వారిని లేపి మరీ అధికారులు ఈ చర్యలకు పూనుకున్నారు. దీంతో కొన్నేళ్లుగా ఉంటున్న గిరిజనులు నిరాశ్రయులయ్యారు. గడ్డం గ్రామ సమీపంలోని 308 కంపార్టుమెంట్ 2005 సంవత్సరం నుంచి 25 నుంచి 30 గిరిజన కుటుంబాలు చెట్లను తొలగించి గుడి సెలు వేసుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని భూములను సాగు చేసుకుంటున్నారు. వీరికి పట్టాలు లేకపోవడంతో అటవీ అధికారులు పలు మార్లు గుడిసెలను తొలగించాలని హెచ్చరించి పోలీ



సుల సహాయంతో గుడిసెల ను తొలగించేందుకు యత్నించారు. మంగళవారం తెల్లవారుజామున అటవీ అధికారులు గు డిసెల్లో ఉన్న వారిని నిద్రలేపి గుడిసెలను కూల్చివేశారు. దీంతో గిరిజనులు భయాందోళనలకు గురయ్యారు. 20 ఏళ్లుగా ఇక్కడ నివసి స్తున్నామని, తామెక్కడకు పోవాలని ఎస్ఆర్ వోలు సుష్మారావు, శ్రీనివాస్‌ను ప్రశ్నించారు. ఈ విషయంపై ఎఫ్ఆర్వోను వివరణ కోరగాపై అధికారుల ఆదేశాల మేరకు గుడిసెలను తొలగించినట్లు తెలిపారు.

# ఉద్యోగుల శ్రేయస్సు కోసం ముందుండాలి

ఉట్నూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయ సంఘం నూతన డైరీని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మంగళవారం ఆవిష్కరించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ క్యాంపు కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు కలిసి సమస్యల వివరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులు కలిసి సమ స్యలు వివరించారు. పీవో మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయులు శ్రేయస్సు కోసం టీఎస్ టీడబ్ల్యూటీయూ సంఘం కృషి చేయాలన్నారు. గిరిజన మారుమూల ప్రాంతంలో పని చేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులు శ్రేయస్సు కోసం సంఘం ఎల్లప్పుడు ముందుండాలని, గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారం కోసం తనవంతు మద్దతు ఉంటుందని



అన్నారు. 1983లో ప్రారంభించిన ఈ సంఘం గిరిజన సంక్షేమ శాఖలో పని చేసే ఉద్యోగ ఉపాధ్యాయుల కోసం అహర్నిశలు కృషి చేస్తూ ముందుకెళ్లని, ఇది గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులకు మాత్ర సంఘం అని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రయాణికులను గౌరవించాలి

నిర్మల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) ప్రతీ ఆర్టీసీ ఉద్యోగి ప్రయాణికులను గౌరవించాలని ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ప్రొజెక్టర్ ద్వారా ఉద్యోగులకు డ్యూటీలో ఉన్నప్పుడు పాటించాల్సిన నియమాలపై మంగళవారం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ క్లాసులు ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు ఈ సంస్థ నాది అని పనిచేయాలని, అప్పుడే మనం తృప్తి చెందుతామని సూచించారు. ఈ క్లాసులు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామన్నారు. డిపోలోని ప్రతీ ఉద్యోగి ఈ క్లాసులకు రావాలని తెలిపారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు

### విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

చెన్నూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం) క్యాతనపల్లి గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో మొట్టమొదటి సారిగా ఏకగ్రీవంగా ఎన్నికై వరుసగా మూడు పర్యాయాలు 13 సంవత్సరాలు సర్పంచ్‌గా పదవీ బాధ్యత చేపట్టిన వెంకటయ్య 38వ వర్ధంతి సందర్భంగా ఆయన మనవడు సంతోష్ విద్యార్థులకు మంగళవారం విద్యార్థినిలకు స్టేషనరీ పంపిణీ కార్యక్రమం చేపట్టారు.





# భాగ్యశ్రీకి వరుస ఆఫర్లు

ఔరా అనిపించే ఔరంగబాద్ అందం భాగ్యశ్రీ బోర్సే బంపర్ ఆఫర్ కొట్టేసింది. తమిళ అగ్ర కథానాయకుడు సూర్య సరసన నటించే ఛాన్స్ ఈ ముద్దుగుమ్మని వరించినట్టు చెన్నై మీడియాలో బలంగా వార్తలొస్తున్నాయి. సూర్య కథానాయకుడిగా తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటైర్టైన్మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మించనుంది. జీవీ ప్రకాష్‌కుమార్ సంగీత దర్శకుడు. ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా ఖాయం అయ్యిందట. మే నెలలో షూటింగ్ మొదలు కానున్నట్టు సమాచారం. తొలి సినిమా 'మిస్టర్ బచ్చన్' ఫలితం ఎలా ఉన్నా.. భాగ్యశ్రీబోర్సే మాత్రం అందంతో మార్కులు కొట్టేసి యూత్‌ని కట్టిపడేసింది. అందుకే ఈ ముద్దుగుమ్మకు అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంత' సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నది భాగ్యశ్రీబోర్సే. రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. రామ్ పోతినేని హీరోగా 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేం మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రంలోనూ భాగ్యశ్రీనే కథానాయిక. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో రూపొందుతోన్న 'కింగ్‌డమ్'లోనూ భాగ్యశ్రీనే హీరోయిన్. ఈ లైనప్‌ని బట్టి చూస్తుంటే.. ఈ ముద్దుగుమ్మకు మహర్దశ మొదలైందనిపిస్తుంది.





# అల్లు అర్జున్‌తో జాన్వీకపూర్ రోమాన్స్

ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ నటించిన పుష్ప–2 మూవీ బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పుష్ప తర్వాత బన్నీ ఏం సినిమా చేయబోతున్నాడనే చర్చ సాగుతున్నది. సమాచారం మేరకు అల్లు అర్జున్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో ఓ సినిమా చేయనున్నాడనే వార్త తెగ వైరల్‌గా మారింది. అయితే, ఈ ప్రాజెక్టు కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉందని.. ఈ మూవీని పక్కన పెట్టి బన్నీ తమిళ ప్రముఖ దర్శకుడు అట్లీతో సినిమా చేయనున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ, అలనాటి అందాల తార శ్రీదేవి ముద్దుల తనయ జాన్వీ కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకోనున్నట్లు తెలుస్తున్నది. చాలారోజులుగా బన్నీతో అట్లీ సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇద్దరి కాంబోలో హై యాక్షన్ సినిమా తెరకెక్కించనున్నట్లు టాక్ నడుస్తున్నది. త్వరలోనే వివరాలను ప్రకటించనున్నారు. ఇక అల్లు అర్జున్‌తో జాన్వీ కపూర్ రొమాన్స్ చేయనున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయంపై ఇప్పటి వరకు ఎవరూ అధికారిక ప్రకటన చేయలేదు. జాన్వీ కపూర్ తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' మూవీతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది.



# మంచుమనోజ్ అరెస్టు..?



మంచువారి ఇంట వివాదం కొనసాగుతూనే ఉంది. హీరో మంచు మనోజ్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తున్నది. తిరుపతిలోని ఇంట్లో ఉన్న మనోజ్‌ను అదుపులోకి తీసుకుని భాకరాపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కుటుంబ వివాదంలోమోహన్ బాబు చేసిన ఫిర్యాదు ఆధారంగానే అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. కాగా, భాకారాపేట సమీపంలోని ఉర్జా రిసార్ట్‌లో మనోజ్ బస చేస్తున్నారు. సోమవారం రాత్రి 12 గంటల తర్వాత పెట్రోలింగ్‌లో భాగంగా మనోజ్ వద్దకు వెళ్లిన పోలీసులు.. ఆయన్ను పలు ప్రశ్నలు అడిగారు. దట్టమైన అటవీ ప్రాంతంలో ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. ఇక్కడ సెలబ్రిటీలకు అంత సురక్షితం కాదని సూచించారు. అయితే పోలీసుల డ్రామా అంటూ వారి తీరును తప్పుపట్టిన మనోజ్.. నేను ఇక్కడ విశ్రాంతి తీసుకుంటే మీకేంటి ఇబ్బంది అంటూ నిలదీశారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తున్నది.



# ఫౌజీలో యువరాణిగా అలియాభట్

అగ్ర కథానాయకుడు ప్రభాస్, హను రాఘవపూడి కాంబోలో ఓ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఫౌజీ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇమాన్ ఎస్మాయిల్ నటిస్తుంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నట్లు సమాచారం. అందుకే ఈ మూవీ టైటిల్ 'ఫౌజీ' అయితే బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగే కథతో రానుండగా బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాలో కీలకమైన బ్రిటిష్ యువరాణి పాత్రలో బాలీవుడ్ నటి ఆలియా భట్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. యువరాణి పాత్ర ఈ సినిమాలో కీలకం కావడంతో.. ఆలియా భట్‌ని తీసుకోబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ నటిస్తున్నాడు.

## అన్నంలో పెరుగు లేదు..
# శ్రీలీలకు తిరుగులేదు

"అన్నంలో పెరుగు లేదు, శ్రీలీలకి తిరుగు లేదు.." అని ఓ నెటిజన్ పెట్టిన కామెంట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకి అతను ఎందు కలా పెట్టాడో తెలియాలంటే స్టోరీ మొత్తం చదవాల్సిందే!గగనాన్ని ముద్దాడే చంద్రిక, వెన్నెలను మోసే మేఘం, విహంగాన్ని ఆకర్షించే ఒక కాంతి... ఇదంతా ఎవరి గురించి అంటే? మన అందాల దేవత, మన గుండెల్లో చిరునవ్వుల వర్షం కురిపించే శ్రీలీల గురించే. ఆమె కళ్లలోని మైమరపు, చిరున వ్వులోని మాధుర్యం, నడకలోని లయ... ఇవన్నీ కలిసొచ్చిన మధుర స్వప్నం. తెలుగుతెరను శాసిస్తున్న ఈ అందాల భామ ఇటీవల నలుపురంగు టీ–షర్ట్‌లో మెరిసిపోతూ మూడు ఫోటోలు తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆ ఫొటోలను చూసిన అభిమానుల గుండెల్లో ప్రేమ తీరం దాటి పొంగిపడింది. ఒక్కొక్కరు ఒక్కో రీతిలో కామెంట్స్ చేస్తుండగా, ఓ అభిమాని కామెంట్ మాత్రం అందరి దృష్టిని ఆకర్షించింది. "అన్నంలో పెరుగు లేదు, శ్రీలీలకి తిరుగు లేదు!" ఏం అభిప్రాయం! ఏమి ఊహాశక్తి! పెరుగు లేకపోవడం అన్నానికి ఎంతలోటో, శ్రీలీలకు పోటీ లేకపోవడం సినీ ప్రపంచానికి అంత వరం! ఈ కామెంట్ చదవగానే నవ్వు ఆపుకోలేం.అభిమానంమామూలుగా లేదు సుమండి! టాప్ స్టార్‌గా ఎదుగుతుందా?తెలుగు ప్రేక్షకులకు ఆమె పరిచయం అవసరమే లేదు. "పెళ్లి సందం"తో వచ్చి అందరి హృదయాలను గెలుచుకున్న ఈ కాంతిరేఖ, వరుస విజయాలతో ఇండస్ట్రీలో బిగ్ స్టార్‌గా మారింది. 'ధమాకా'చిత్రంలో తన నర్తనంతో, తన ఎనర్జీతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఆమె కేవలం అందమే కాదు, నటనలోనూ తనదైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్‌లో హీరోలందరూ శ్రీలీలతో జోడీ కడుతున్నారు. మహేశ్ బాబు నుంచి వరకూ, టాప్ హీరోలతో నటిస్తూ అవకా శాలను సొంతం చేసుకుంటుంది.

## ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

**తాంసి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**



క్షణికావేశంలో ఉరి వేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇది. వివ రాల్లోకి వెళితే... తాంసి మండలంలోని బండల నాగాపూర్ గ్రామానికి చెందిన ముష్టి చంద్ర కాంత్ (30) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాధిక పేర్కొన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే చంద్రకాంత్ మంగళవారం సాయంత్రం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంటికి వచ్చిన భార్య ఈ విషయాన్ని చూసి లబోదిబోమంటూ ఇరుగుపొరుగు వారికి చెప్పింది. వెంటనే పరుగు పరుగున వచ్చి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వివరించారు. తాగిన మైకంలోనే ఈ సంఘటనకు పాల్పడి ఉంటాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు వ్యవసాయం చేస్తూ సంతోషంగా జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడి భార్య ప్రవలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాంసి ఎస్ఐ వివరించారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

**లక్షెట్టిపేట, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. ఈనెల 13న కాందపు ప్రసాద్ ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి బీరువా చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బంగారు చెవికమ్మలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రాత్రి గ్రామానికి చెందిన వేముల రామయ్య ఇంట్లో తాళాన్ని పగులగొట్టిన దొంగలు బంగారాన్ని ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఆదిలాబాద్ పట్టణంలో చోరీ

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని తాటిగూడకు చెందిన షేక్ ఆయుబ్ బైక్ చోరీకి గురైంది. 12న ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సాయంత్రం వాకింగ్ కోసం వెళ్లా డు. స్టేడియంలో పార్కింగ్ చేసి గంట తర్వాత తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా దొరకలేదు. మంగళవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై సయ్యద్ ఇసాక్ అలీ కేసు నమోదు చేశారు.

## ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**భీంపూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామానికి చెందిన గడ్డం పొచ్చన్న (36), కూలీ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉండేవాడు. గత రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. గతేడాది భార్య తల్లిగారింటికి వెళ్లి ఉంటోంది. పొచ్చన్న తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. మద్యం మత్తులో మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృ తుడి తండ్రి కిష్టన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రైలు కిందపడి ఒకరు మృతి

**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని గోదావరి రైల్వేబ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ కుమార్ కథనం ప్రకారం..స్థానిక అశోక్ రోడ్డు చెందిన సయ్యద్ జమీర్(27) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల వల్ల తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం గుర్తుతెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకెళ్లాలి

**రెబ్బెన, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుంటూ ఉద్యోగులంతా ముందుకెళ్లాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో షాప్ ఫ్లోర్ లైఫ్ సైకిల్ కార్యక్రమంపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగి తపు రహిత ఉత్తర, ప్రత్యుత్తరాల సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్న సింగరేణి అందుకు తగిన చర్యలను వేగవంతం చేసిందన్నారు. పర్యావరణహిత చర్యల్లో భాగంగా కాగితాలకు ప్రత్యామ్నాయంగా వినియోగించే షాప్ ఫ్లైల్ లైఫ్ సైకిల్పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కాగితపు రహిత ఉత్తర, ప్రత్యుత్తరాలల్లో బెల్లంపల్లి ఏరియా ముందుండాలని అధికారులకు సూచించారు. ఏప్రిల్ నుంచి సింగరేణి వ్యాప్తంగా పేపర్‌లెస్ ప్రక్రియ అమలులోకి రానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజమల్లు, పీవో నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ ఇన్చార్జి ముజీబ్, కార్పొరేట్ ఐటీ అధికారులు హరిప్రసాద్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే వారికి హెచ్‌ఐవీ పరీక్షలు చేయాలి

**కెరమెరి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

సాధారణ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగుల్లో 10 శాతం మందికి హెచ్ఐవీ, ఎయిడ్స్ పరీక్షలు చేయాలని ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల హెచ్ఐవీ, ఎయిడ్స్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నీలిమ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్య సిబ్బంది, రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు గర్భిణులకు మాత్రమే హెచ్ఐవీ పరీక్షలు చేసేవారని, ఇకనుంచి రోగులకు కూడా చేయాలన్నారు. ఆస్పత్రిలో కిట్స్ అందుబాటులో ఉంచాలని, రోగుల నుంచి రక్తపూతలు తీసి ఎప్పటికప్పుడు ల్యాబ్కు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రియాజ్, సూపర్వైజర్ మెస్రం సోము, హెచ్ఎలు వసంత్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు షీ టీం భరోసా



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి, విద్యార్థినీలకు షీ టీం భరోసా సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డబ్ల్యు ఎస్ఐ శిరీష, భరోసా ఇన్‌ఛార్జ్ డబ్ల్యు ఎస్ఐ తిరుమల మాట్లాడుతూ బాల బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టం గురించి పోక్సో చట్టం ప్రకారం అమలులో ఉన్న శిక్షల గురించి, బాల్య వివాహ చట్టం సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌తో ముందుకు వెళ్లాలో వివరించారు.

## తలసేమియా వ్యాధిగ్రస్తులకు విరాళం అందజేత



**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రక్త నిధి కేంద్రంలో మంగళవారం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన మందుల కోసం లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు బి సత్తిరెడ్డి విరాళం అందజేశారు. రక్తనిధి కేంద్రం ఇన్ ఛార్జ్ లయన్ వి. మధుసూదన్ రెడ్డి విజ్ఞప్తి మేరకు తన కూతురు రోహిణి సాయి విశాల్ రెడ్డి మొదటి పెళ్లిరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విరాళం అందించారు.

## ఉరి వేసుకొని బలవన్మరణం

**దిలావర్‌పూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

మండలంలోని మాడేగాం పంచాయతీ అనుబంధ గ్రామమైన కదిలికి చెందిన జగదేకర్ గంగాధర్ (56) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సందీప్ కథనం ప్రకారం.. గత కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు మద్యం మానేయాలని ఎంత చెప్పినా వినలేదు. ఈ క్రమంలో అనారోగ్యం బారినపడ్డాడు. మంగళవారం కుటుంబీకులు పని నిమిత్తం పంట చేలకు వెళ్లారు. ఇంట్లో ఉరేసుకున్నాడు. భార్య శాంతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదు

**చెన్నూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

చెన్నూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి మనోజ్‌పై దాడి చేసిన ఏడుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 6న బీసీ గురుకుల పాఠశాలలో చదువుతున్న నస్పూర్ గ్రామంలోని ఇందారం కాలనీకి చెందిన విద్యార్థి పులి మనోజ్‌తోటి విద్యార్థులు దాడి చేసి వీడియో చిత్రీకరించి ఇన్స్టాగ్రాంలో పోస్ట్ చేశారని బాధిత విద్యార్థి తండ్రి రాజేందర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రఘునాథ్, విజయ్, యువరాజ్, రజనీకాంత్, మణికంఠ, సన్నీ, సిద్ధూపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రిన్సిపాలు విధుల నుంచి తొలగించడంపై విద్యార్థులు ఆందోళనకు దిగేందుకు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకుంటామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం పాఠశాల ను సందర్శించారు. విద్యార్థులు రోడ్డు పైకి వచ్చి ఆందోళన చేపట్టవద్దన్నారు. సమగ్ర విచారణ జరిపి ఉన్న తాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. సీఐ రవీందర్, ఆర్సీవో శ్రీధర్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఉన్నారు.

## విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి రిమాండ్

**రెబ్బెన, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతోపాటు దురుసుగా ప్రవర్తించిన ఇద్దరిని మంగళవారం రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 12న గంగాపూర్ జాతర నేపథ్యంలో పోలీసుస్టేషన్ పరిధిలోని దేవులగూడ సమీపంలో ఎస్సీఐ పాయింట్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ సాగర్ విధులు నిర్వహించారు. అదే ప్రాంతంలో రెబ్బెనకు చెందిన మహ్మద్ షాజీం, దేవులగూడకు చెందిన దారావత్ శ్రీకాంత్లు గొడవ పడుతుండటంతో గమనించిన పోలీసు సిబ్బంది పరిస్థితిని అదుపు చేసే ప్రయత్నం చేశారు. వారు పోలీసు సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## శివాజీ మహారాజ్ జయంతి ర్యాలీని జయప్రదం చేయాలి

**నిర్మల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బుధవారం నిర్వహించే బైక్ ర్యాలీ జయప్రదం చేయాలని శివాజీ సేవా సమితి అధ్యక్షుడు రాజు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎన్టీఆర్ స్టేడియం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని మంగళవారం పేర్కొన్నారు. శివాజీ చౌక్ వరకు చేరుకుంటుందని ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. హిందూ బంధువులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.




## రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

### మిన్నంటిన అంధుడైన కుమారుడి రోధనలు

**దిలావర్‌పూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

అంధుడైన కుమారుడికి ఆ తండ్రి అన్నీ తానై వ్యవహరించాడు. అంధుల కోటాలో ఉద్యోగం సాధించగా.. ప్రతిరోజు వెంట ఉండి విధులకు తీసుకెళ్తూ తీసుకొచ్చేవాడు. మంగళవారం సాయంత్రం కుమారుడిని తీసుకుని ఇంటికి వెళ్తుండగా.. ద్విచక్రవాహనం రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. తీవ్రంగా గాయపడిన తండ్రి చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ సంఘటన మండల కేంద్రమైన దిలావర్పూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని నర్సాపూర్(జి) గ్రామానికి చెందిన ఎడ్దూర్ భోజన్న కుమారుడు ప్రవీణ్ రెండు నెలల క్రితం అంధుల కోటాలో దిలావర్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగం సాధించాడు. దీంతో ప్రవీణ్‌ను భోజన్న ప్రతి రోజు ఆయన వెంట ఉండి కార్యాలయానికి తీసుకొచ్చి సాయంత్రం విధుల తర్వాత తీసుకెళ్తూ ఉండేవాడు. మంగళవారం సాయంత్రం కార్యాలయ విధులు ముగిసిన తర్వాత ప్రవీణ్‌ను తీసుకుని భోజన్న బస్టాండ్‌కు నడిచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం భోజన్నను ఢీకొట్టింది. దీంతో భోజన్న తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. ఏం జరిగిందో తెలియక పక్కనే ఉన్న ప్రవీణ్ నాన్నా ఏమైందంటూ రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచివేసింది. భోజన్నను 108లో నిర్మల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. అంధుడైన ప్రవీణ నిత్యం చేయి పట్టుకుని కార్యాలయానికి తీసుకువచ్చే తండ్రి భోజన్న రోడ్డు ప్రమాదంలో మరణించిన ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. భోజన్నకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ద్విచక్రవాహనదారుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

# భ్రూణ హత్యల నివారణపై సర్కారు దృష్టి



- ప్రత్యేక కార్యచరణ అమలు
- ఆదిలాబాద్ జిల్లాలోని స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోంలపై నిఘా
- తనిఖీలు చేసినా ప్రైవేటు ఆస్పత్రుల్లో జోరుగా లింగ నిర్ధారణ పరీక్షలు
- నిరూపణ అయితే వైద్య సిబ్బంది జైలుకే
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో అబార్షన్లు చేస్తూ డబ్బులు గుంజుతున్న కొంత మంది వైద్యులు



ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రత్యేక ప్రతినిధి

**ఆడ, మగ ఇద్దరూ సమానమేననే భావన ఇంకా సమాజంలో నాటుకుపోవాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. సాంఘిక కట్టుబాట్లు, వరకట్న దురాచారం, శారీరక, మానసిక వేధింపుల వంటి వాటితో ఆడపిల్లలకు జన్మనివ్వాలంటేనే మహిళలు వెనుకాడుతున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల బలహీనతను కొందరు డాక్టర్లు ఆధారంగా చేసుకొని పుట్టబోయేది ఆడబిడ్డ అయితే అబార్షన్లు చేస్తున్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లపై నిఘా వేసింది. ఇందులో భాగంగానే స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కొంత మంది ప్రైటు వైద్యులు ఆస్పత్రుల్లో యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇదే కాకుండా తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల బలహీనతను ఆసరా చేసుకొని కొందరు డాక్టర్లు అబార్షన్లు చేస్తూ డబ్బులు గుంజుతున్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.**

ఆడ, మగ.. పుట్టే బిడ్డ ఎవరైనా ఇద్దరూ సమానమే. అయినా కొందరు స్కానింగ్‌ల ద్వారా తమకు పుట్టే బిడ్డలను తెలుసుకుంటూ భ్రూణ హత్యలకు పాల్పడుతు న్నారు. తల్లి దండ్రులు, కుటుంబసభ్యుల బలహీనతను ఆసరా చేసుకొని కొందరు డాక్టర్లు అబార్షన్లు చేస్తూ డబ్బులు గుంజుతున్నారు. దీనిపై వైద్యారోగ్య శాఖ ప్రత్యే క దృష్టి పెట్టింది. జిల్లా వ్యాప్తంగా స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హెూంలపై నిఘా పెట్టింది. లింగనిర్ధారణ జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేసింది. నిరంతరం తనిఖీలు చేస్తూ, దవాఖా నలను పర్యవేక్షిస్తున్నది. ఆడ, మగ ఇద్దరూ సమాన మేననే భావన ఇంకా సమాజంలో నాటుకుపోవాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. సాంఘిక కట్టుబాట్లు, వరకట్న దురాచారం, శారీరక, మానసిక వేధింపుల వంటి వాటితో ఆడపిల్లలకు జన్మనివ్వాలంటేనే మహిళలు వెనుకాడు తున్నారు. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల బలహీనతను కొందరు డాక్టర్లు ఆధారంగా చేసుకొని పుట్టబోయేది ఆడబిడ్డ అయితే అబార్షన్లు చేస్తున్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోంలపై నిఘా వేసింది. ఇందులో భాగంగానే జిల్లా కలెక్టర్ రాజర్షి షా సైతం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

### కొనసాగుతున్న భ్రూణ హత్యలు..

ఎన్ని చట్టాలున్నా భ్రూణ హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. రోజు రోజుకూ అమ్మాయిల నిష్పత్తి తగ్గుతూనే ఉంది. అమ్మాయిల సంఖ్యను మెరుగుపరచడానికి ప్రభు త్వం కళాజాత, సదస్సులు నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నది. ఆదిలాబాద్ జిల్లా పరిధిలో 33 స్కానింగ్ సెంటర్లకు అనుమతి ఉండగా, ప్రస్తుతం ఇందులో 27 పని చేస్తున్నాయి. వాటిపై నిరం తర పర్యవేక్షణతో పాటు నిఘా వేసింది. లింగనిర్ధారణ పరీక్షలకు సంప్రదించిన వారి వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు తెలియజేస్తు న్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తే వెంటనే సమాచారం అందించాలని కోరుతున్నారు.

### ముందు నుంచే పర్యవేక్షణ...

మహిళ గర్భం దాల్చిన వెంటనే ఆమె పూర్తి వివరాలను వైద్య సిబ్బంది అంగన్‌వాడీ సెం టర్‌లో, స్థానిక పీహెచ్‌సీలో, యూపీహెచ్‌సీలో నమోదు చేసుకుంటున్నా రు. ప్రభుత్వం అందజేస్తున్న న్యూట్రీషన్ కిట్, పౌష్టికా హారం వారికి పంపిణీ చేస్తూ ఆరోగ్య పరీక్షలు నిర్వహి స్తున్నారు. అలాగే గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరిస్తున్నారు.

### లింగ ఎంపిక నిషేధ చట్టం..

భ్రూణ హత్యలను అరికట్టేందుకు ప్రభుత్వం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణ చట్టం 1994లో ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్(పీఎన్‌డీటీ) అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హెూమ్‌లు నడుచుకోవాల్సి ఉంటుంది. గర్భిణీకి అవసరాన్ని బట్టి పిండం ఎదుగుదలకు చెందిన పరీక్షలు మాత్రమే చేయాలి, మరే ఇతర పరీక్షలు నిర్వహించినా కఠిన చర్యలు తీసు కుంటారు. గర్భంలోని పిండం ఆడ, మగా అనే విషయా న్ని ఎట్టి పరిస్థితుల్లో బహిర్గతం చేయరాదు. స్కానింగ్ పరీక్షలు నిర్వహించిన మహిళ వివరాలు రికార్డుల్లో నమోదు చేయాలి. ఒక రేడియాలజిస్టు రెండుకు మించి స్కానింగ్ సెంటర్లలో విధులు నిర్వహించకూడదు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి పట్టుబడినట్లుయితే సంబంధిత సెంటర్ రిజిస్ట్రేషన్ రద్దుతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నిజ నిర్ధారణ జరిగినట్లయితే చట్ట పరిధిలో మూడేళ్లు, అంతకు మించి జైలుశిక్ష, రూ. 10వేలు, అంతకు మించి జరిమానా విధించే అవకాశం ఉంటుంది. స్కానింగ్ సెంటర్లు నిర్వహించిన వైద్య పరీక్షలకు పూర్తి బాధ్యత సెంటర్‌కు అనుసంధానంగా ఉన్న రేడియాలజిస్టుతో పాటు గైనకాలజిస్టులకు కూడా ఉంటుంది. వారిపై కూడా చర్యలు తీసుకుంటారు.

### స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంది..

స్కానింగ్ సెంటర్లపై నిరంతర నిఘా కొనసాగి స్తున్నాం. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరీక్షిస్తున్నాం. రికార్డుల నిర్వహణ సరిగా లేని వారికి నోటీ సులు జారీ చేస్తున్నాం. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని కొన్ని ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని డీఎంహెచ్‌వో తెలిపారు.

---

## ఇద్దరు ఆటోడ్రైవర్లకు ఆరునెలల జైలు శిక్ష

**లక్ష్మణచాంద, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరు ఆటోడ్రైవర్లకు ఆరునెలల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ఫస్ట్ క్లాస్ మె జిస్ట్రేట్ ఆర్. అజయ్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్సై సుమలత కథనం ప్రకారం.. 2016 నవంబర్ 23న మండలంలోని వడ్యాల్ శివారులోని సరస్వతి కెనాల్ బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వడ్యాల్‌కు చెందిన బొచ్చు రాజవ్వ, లక్ష్మణచాంద గ్రామానికి చెందిన నిమ్మల గోదావరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై లక్ష్మణచాంద పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అడిషనల్ పీపీ దేవేందర్ సాక్షులను ప్రవేశపెట్టి కేసు రుజువు చేశారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు ఆటోడ్రైవర్లు షేక్ ఇమ్రాన్, షేక్ సోఫీలకు జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు.

## గాయపడిన బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే

**సిర్పూర్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన బాబురావు, రామ్ నారాయణ, పోచయ్య, లక్ష్మి నారాయణ మూర్తిలను ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మంగళవారం పరామర్శించి డాక్టర్లతో మాట్లాడి, మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరారు. 2 రోజుల క్రితం స్నేహితుడి కుమార్తె పెళ్ళికి హాజరై హెూటల్లో బస చేసి, లిఫ్ట్ దిగే క్రమంలో లిఫ్ట్ కిందపడడంతో వీరికి గాయాలయ్యాయి.



## సమస్యల పరిష్కారానికి కదిలిన గ్రామీణ వైద్యులు



**ముథోల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు అతి తక్కువ వ్యయంతో ప్రథమ చికిత్సలు చేస్తున్న గ్రామీణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సమస్యల పరిష్కారానికి ముథోల్ నియోజకవర్గం నుండి డివిజన్ అధ్యక్షులు మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం పెద్ద ఎత్తున హైదరాబాద్ తరలి వెళ్లారు. బహిరంగ సభలో ఎమ్మెల్సీ కోదండరాంరెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పాల్గొననున్నట్లు తెలిపారు. నిర్మల్ జిల్లా కార్యదర్శి గంధం పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజా సమస్యలపై ఉద్యమిస్తాం'

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల కోడ్ అనంతరం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జిల్లాకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానా శ్రయం ఏర్పాటు, సిమెంట్ ఫ్యాక్టరీ తెరిపించడం వంటి ప్రధాన హామీలతో జిల్లా వాసులను ఏళ్లుగా మోసం చేస్తోందని విమర్శిం చారు. ఎన్నికల కోడ్ అనంతరం ఆయా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రాములు, అరుణ్ కుమార్, నర్సింగ్గారావు, మహబూబ్ ఖాన్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థినుల ఆరోగ్యంపై వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుంద ని ఏజెన్సీ అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రక్తనమూనాలు సేకరించారు.

# బొజ్జు దాదా..బాగా కష్ట పడుతున్నావ్.!





- మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్ నాయక్..
- కొంత మంది విమర్శలను పట్టించుకోకు
- అభివృద్ధే ధ్యేయంగా ముందు సాగాలి
- అనారోగ్యంతో బాధపడుతున్న గోవింద్ నాయక్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- ఇద్దరు నాయకుల మధ్య మాటా-మంతి

**(ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి)**

అనారోగ్యంతో బాధపడ్తున్న బంజారా దిగ్గజం, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా గోవింద్ నాయక్ ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పరామర్శించారు. దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో స్వంత ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్న గోవింద్ నాయక్ ను కలిసేందుకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆయన ఇం టికి వెళ్లారు. ఆరోగ్య పరిస్థితులు,యోగక్షేమాలు తెలుసుకొన్నారు. నాయక్ దంపతులను శాలువతో సత్కరించారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధిపై ఇరువురు నేతలు చర్చించారు. అతి పిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన వెడ్మ బొజ్జు పటేల్‌ను గోవింద్ నాయక్ అభినంధించారు.ఎమ్మెల్యేగా ప్రజలతో మమేకమై నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం చేస్తున్న కృషిని కొనియాడారు. కడం ప్రాజెక్టు కు మరమ్మతులు చేయించి ఆయకట్టుకు నీరందించడంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ కృషి అమోఘమని గోవింద్ నాయక్ పేర్కొన్నారు. గంగాపూర్ గ్రామస్థుల దశబ్దాల కోరిక ఐన గంగాపూర్ బ్రిడ్జి పనులు మంజూరు చేయించి వారి సమస్య తీర్చినందుకు అక్కడి ప్రజలు వెడ్మ బొజ్జుపటేల్ పేరును చిరస్థాయిలో గుర్తుంచుకోంటారని గోవింద్ నాయక్ పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాల నుంచి వచ్చి ఎమ్మెల్యేగా ఎదగడం ప్రజల మద్ధతుతోనే సాధ్యమైందన్నారు. రాజకీయాల్లో ఎదుగుతున్నా కొద్ది కొంత మంది విమర్శలు చేస్తుంటారని వాటిని పట్టించుకోకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తమకున్న అనుభ వంతో తనకు సూచనలు సలహాలు అందించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గోవింద్ నాయక్ ను కొరారు. తన సహాకారం ఎల్లవేళలా ఉంటుందని గోవింద్ నాయక్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

# బెల్లంపల్లిలో ఐటీ పార్కు మంజూరుకు కృషి

### మంత్రి శ్రీధర్ బాబు - ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించుకోవాలి



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఐటీ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మంగళవారం రాత్రి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి బెల్లంపల్లి అభివృద్ధి కోసం అలాగే ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు సీఎం రేవంత్ రెడ్డి పరిశీలనలో ఉందన్నారు. అభివృద్ధిలో బెల్లంపల్లికి ఉజ్వలమైన భవిష్యతు ఉందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి విజయం బెల్లంపల్లి విద్యరంగం అభివృద్ధికి ఇంతకన్నా దోహదపడుతుందన్నారు. నైపుణ్యమైన విద్య ఉన్నత ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణలో విద్యారంగం బలోపేతంలో నైపుణ్యమైన విద్యను అందించడంలో నరేందర్ రెడ్డి ముందు వరుసలో ఉంటాడన్నారు. ఎంతో మంది పేదలకు విద్యా బోధనతో నిరుద్యోగులకు భవిష్యత్తు కల్పించాడన్నారు. రాబోవు రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి హాయంలో విప్లవాత్మకమైన అభివృద్ధిని ప్రజలు చూస్తారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట సీఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. బిజెపి, బీఆర్ఎస్ కు పదేళ్ల పరిపాలనలో ఏమి చేయలేదన్నారు. ఆ రెండు పార్టీలకు మాట్లాడే అర్హత లేదని తీవ్రంగా స్పందించారు. బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోసం చేసిందన్నారు. ఒక ఉద్యోగం కూడా ఇవ్వలేదు అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమ ర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బీఆర్ఎస్‌కు విద్యావంతులు తగిన బుద్ధి చెప్పాలి అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి మాట్లాడారు. తనను గెలిపిస్తే పేద ప్రజల పిల్లలకు ఉన్నత విద్యను అందించి భవిష్యత్తును కల్పిస్తామన్నారు. నియోజవర్గాన్ని విద్యారంగంలో ఉన్నతంగా తీర్చిదిస్తానన్నారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్, కాంగ్రెస్ నాయకులు ముచ్చర్ల మల్లయ్య, శంకర్, స్వామి, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ శ్వేత పాల్గొన్నారు.

### మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిని

# పరిశీలించిన కేంద్ర బృందం



**మంచిర్యాల, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా లోని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల పనితీరుపై పీఆర్సీ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ విశాఖ పట్నం కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ జాతీయ మిషన్ బృందం సభ్యులు పరిశీలన చేపట్టారు. మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసు పత్రి వైద్యులతో కలిసి మాత శిశు సంరక్షణ కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఉప కేంద్రాలు, ఆయుష్మాన్ బస్తి ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలపై క్షేత్ర స్థాయిలో నాలుగు రోజులపాటు పరిశీలించనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు 22 ఇండికేటర్స్ అంశాల పైన సమీక్ష చేయనున్నారు. మొదటి రోజు జిల్లాలోని హమాలివాడ బస్తి దావఖాన, మందమరి మండలం దీపక్ నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజుతో కలిసి పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆరోగ్య మిషన్ వైద్యులు రమణ, రీసెర్చ్ ఇన్వెస్టిగేషన్ వైద్యులు శ్రీనివాస్, ప్రశాంతి, డిపిఎం విశ్వేశ్వర్, సూపరిండెంట్ వెంకట సాయి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మందమర్రిలోని ఆరోగ్య కేంద్రాన్ని పాపులేషన్ రీసెర్చ్ టీం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆరోగ్య మిషన్ వైద్యులు రమణ, శ్రీనివాస్ బృందంతో జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల్లో భాగంగా అందిస్తున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు.

### సేవాలాల్ మహారాజ్ జయంతి

# ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు సూచించారు. ఈ నెల 24 వ తేదిన పట్టణంలోని రామ్ లీలా మైదాన్‌లో నిర్వహించనున్న జయంతి వేడుకలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎన్నికల కోడ్ నియమ నిబంధనల ననుసరించి ఉత్సవాలను జరపాలని తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత అధికారులు ఆర్టీసీ ద్వారా బస్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ శాఖ ద్వారా నిరంతర కరెంటు సరఫరా చేయాలని, మున్సిపల్ రెండు రోజుల ముందు నుండే శానిటేషన్ చేయాలనీ, పంచాయతీ శాఖ ద్వారా ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ త్రాగునీరు సౌకర్యం, వైద్య శాఖ ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు, పోలీస్ శాఖ ద్వారా బారికేడింగ్స్, పోలీస్ బందోబస్తు, పార్కింగ్ ప్లేస్ తదితర ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి,ఆర్డీవో వినోద్ కుమార్, బంజారా ఉత్సవ కమిటీ చైర్మన్ భీమ్ రావ్, ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



### నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా

# రితేష్ రాథోడ్ నియామకం

### మంగళవారం ప్రకటన విడుదల చేసిన బీజేపీ పార్టీ అధిష్టానం

**నిర్మల్, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**



భారతీయ జనతా పార్టీ మరో ఐదు జిల్లాలకు అధ్యక్షులను నియామకం చేపట్టినట్లు ఆ పార్టీ రాష్ట్ర సహఎన్నికల అధికారి కే గీతా మూర్తి మంగళవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. బీజేపి పార్టీ తెలంగాణ సంఘటన పర్వ్ 2024 ఎన్నికల నియమావలి ఆధారంగా రాష్ట్ర ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీ నారాయణ అధ్యక్షులను, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను నియమించినట్లు తెలిపారు. నియమకాలు తక్షణమే అములులోకి వస్తాయని తెలిపారు. నారాయణపేటజిల్లా - సత్య యాదవ్, సూర్యాపేట జిల్లా- శ్రీలత రెడ్డి , నిర్మల్ జిల్లా - రితేష్ రాథోడ్, సిద్దిపేట జిల్లా - బైరి శంకర్ ముదిరాజ్, రాజన్న సిరిసిల్ల జిల్లా - ఆర్‌గోపి ముదిరాజ్‌లను నియామకం చేసినట్లు తెలిపారు. సూర్యాపేటజిల్లా అధ్యక్షులుగా శ్రీలత రెడ్డి నియామకం చేయడంతో మొదటి సారి జిల్లా అధ్యక్ష పదవిలో మహిళకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. నిర్మల్ జిల్లాకు మాజీ ఎంపి రమేష్ రాథోడ్ కుమారుడు రితేష్ రాథోడ్ నియామకం చేశారు.

### టైగర్ జోన్‌లో ఐదు మండలాల

# రాకపోకలకు అనుమతి



**జన్నారం, ఫిబ్రవరి 18 (ప్రభాత సమాచారం)**

టైగర్ జోన్ కోర్ ఏరియా నుంచి 24 గంటలు ఐదు మండలాల ప్రజల రాకపోకలకు అనుమతి ఇస్తూ ఎఫ్ పీటీ శాంతారాం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ తెలిపారు. కడెం, దస్తురాబాద్, ఉట్నూర్, జన్నారం, దండేపల్లి మండలాల ప్రజలకు ఎ లాంటి పర్యావరణ శిస్తు వసూలు చేయడం ఉండదని, ఆయా మండలాల ప్రజలు ధ్రు వీకరణ పత్రం చూపించి ఏ సమయంలోనైనా ఈ ప్రాంతం గుండా వెళ్లవచ్చని పేర్కొన్నారు.